## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తిపాలెం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఆగర్తిపాలెం 11కేవీ ఫీడర్‌లో కొత్త లైన్ ఏర్పాటుతో పాటు సాంకేతిక మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎ.పూర్ణచంద్రశేఖరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగర్తిపాలెం, ఆగర్రు, గోరింటాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులకు సహకరించాలని ఆయన కోరారు.

### సిద్ధాంతం పీహెచ్‌సీ వైద్యురాలిగా సుప్రియ



సిద్ధాంతం పీహెచ్‌సీలో బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సుప్రియ

పెనుగొండ: సిద్ధాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలుగా డాక్టర్ డి సుప్రియ శనివారం బాధ్యతలుస్వీకరించారు. ఇప్పటి వరకూ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.రుచిక ఉన్నత విద్య నభ్యసించడానికి గన్నవరంలోని సిద్ధార్థ వైద్య కళాశాలకు వెళ్లడంతో డాక్టర్ సుప్రియ తణుకు నుంచి బదిలీపై వచ్చారు. డాక్టర్ సుప్రియను మరో డాక్టర్ సి.పావని, ఇతర సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు.

### నేడు కార్తీక వనసమారాధనల నిర్వహణ

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ కాపు కార్తీకవన సమారాధనను ఆదివారం కొత్తగా ఆధునికీకరించిన కాపు కళ్యాణమండపం వద్ద ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కాపులు తరలివచ్చేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటింటికీ ఆహ్వానాలు అందించారు. కార్యక్రమాన్ని కాపు సోదరులు విజయవంతం చేయాలని కాపుసంఘం నాయకులు కోరారు.

**మార్టేరులో**

పెనుమంట్ర: ఆచంట నియోజవర్గం ఆర్యవైశ్య సంఘం కార్తీకమాసం సందర్భంగా వనసమారాధన ఆదివారం మార్టేరు పాలకొల్లు రోడ్డులో నెలకుర్తి వెంకటస్వామి తోటలో జరుగుతుందని ఆర్యవైశ్యలు సంఘం ఆచంట నియోజకవర్గ సభ్యులు రాంబాబు, గాదె వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ మంత్రి పితానిసత్యనారాయణ, చేగొండి సూర్యప్రకాష్‌తో పాటు ఆర్య వైశ్య సంఘ నాయకులు భాను శ్రీనివాసరావు, హాజరవుతారని చెప్పారు.

### స్వామిత్వ సర్వేతో భూ రికార్డులు పదిలం



యాళ్లవానిగరువులో స్వమిత్ర సర్వే పత్రాన్ని అందుకుంటున్న చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: స్వమిత్వ సర్వే ద్వారా ప్రతీ ఒక్కరి భూమి రికార్డులు ఆన్‌లైన్‌లో పదిలంగా ఉంటాయని, వ్యక్తుల మధ్య భూ తగాదాలకు తావుండదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు మండలం యాళవానిగరువు సచివాలయంలో శనివారం స్వమిత్వ సర్వే బృందం గృహాలను సర్వే చేసి లబ్ధిదారులకు భూ హక్కు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందప్రకాష్ తన ఇంటి వివరాలను సర్వే టీమ్‌కి తెలియజేసి భూ హక్కు సర్వే పత్రాన్ని తీసుకున్నారు. ప్రతీ ఒక్కరూ సర్వే టీమ్‌కి సహకరించి వారి భూమి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచుకోవాలని కోరారు. సర్వే టీమ్ కె.ప్రశాంత్, సచివాలయ ఉద్యోగులు ఎస్.రవితేజ, ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

### చుండూరి వెంకన్న సేవలు అభినందనీయం



చుండూరి వెంకన్న శత జయంతి ఉత్సవంలో కుటుంబ సభ్యులు, అతిథులు

పాలకొల్లు సెంట్రల్: చుండూరి వెంకట నారాయణరావు (వెంకన్న) సేవలు మరువలేనివని పద్మశ్రీ విజయగుప్త అన్నారు. శనివారం స్థానిక బంగారువారి శ్రీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చుండూరి వెంకన్న శత జయంతి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ గుప్త చుండూరి వెంకన్న సేవలను కొనియాడారు. అనంతరం పట్టణంలోని ఆరు మునిసిపల్ ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, బంగారు ఉషారాణి, జిల్లా గ్రంథాలయాల మాజీ అధ్యక్షులు వబిలిశెట్టి కనకరాజు, కారుమూరి నరసింహరావు, డాక్టర్ మల్లికార్జున గుప్త, దీన దయాళ్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం

**చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు**



ఏఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్‌యార్డు పాలకవర్గం పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డు సమావేశ భవనంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించేందుకు అవసరమైన పుంత రహదారుల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రహదారుల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా 12కోట్ల 12లక్షల 44 వేల రూపాయలకు ప్రతిపాదనలు పంపగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, టెండర్లు పక్రియ కూడా జరుగుతున్నాయన్నారు. మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్మాణ పనులు చేపట్టిన సమీకృత వ్యవసాయ పరీక్షా కేంద్రం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారిని ఆదేశించారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కటికల సూర్యారావు, నరసాపురం వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్, ఏఎంసీ కార్యదర్శి జీఎంకె ప్రసాద్, పాలకవర్గ సభ్యులు కొప్పినీడి శివాజీ, నడపన వరలక్ష్మి, గొడుగు ఈశ్వరి, బాలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కు అందజేత**

నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం నరసాపురం చీఫ్‌విప్ ప్రసాదరాజు వారి క్యాంపు కార్యాలయంలో మండలంలోని కొప్పర్రు గ్రామం బద్దావారిపేటకు చెందిన అనారోగ్యం (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్న బద్దా పిచ్చయ్య, రత్నకుమారిల నాలుగేళ్ల కుమార్డు అయ్యన్న వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఇంజేటి జాన్ కెనడీ, దొంగ మురళీ, బద్దా విజయరాజు, బద్ద విజయబాబు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. శనివారం నరసాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో డాక్టర్ జాన్ హారిసన్ అధ్యక్షతన జరిగిన అభివృద్ధి, సలహా సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు సంబమూర్తి బహుకరించిన స్లిట్ ల్యాంప్, ఆపరేటింగ్ మైక్రోస్కోప్, ప్రాథమిక శస్త్ర చికిత్సలు, కంటి పరీక్షలు చేసేందుకు ఎల్ఈడీ టీవీ తదితర పరికరాలను ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు కళ్లను పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి పెద్దపీట వేసిందన్నారు. అనంతరం రూ.16లక్షల నిధులతో సమకూర్చిన రక్త పరీక్షలు, సిబీపీ మెషీన్, లివర్, కిడ్నీ, కొలెస్ట్రాల్‌లకు సంబంధించిన బయో కెమికల్ ఎనలైజర్ మిషన్‌లను ప్రసాదరాజు ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి వార్డులను, రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, చిట్టూరి కృష్ణ, కల్పనా దత్త, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు పాల్గొన్నారు.

### కుమ్మరివీధి రామాలయంలో మంత్రి కొట్టు పూజలు



రామాలయం వద్ద మంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి తదితరులు

నరసాపురం: పట్టణంలో ప్రసిద్ధ కుమ్మరివీధి రామాలయాన్ని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సందరిశంచారు. శనివారం పట్టణానికి వచ్చిన ఆయన రామాలయాన్ని ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 110 సంవత్సరాల క్రితం నిర్మించిన రామాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, అగ్నికుల క్షత్రియకార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, కోటిపల్లి ఆనందరావు, కావలి నాని, కోటిపల్లి సురేష్, షేక్ బులిమస్తాన్ తదితరులు ఉన్నారు.

## సీఎం జగన్‌తోనే మత్స్యకారులకు గౌరవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మత్స్యకార నాయకులు

నరసాపురం: రాష్ట్రంలో మత్స్యకారులను రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని నరసాపురం నియోజకరవ్గ మత్స్యకారనేతలు స్పష్టం చేశారు. మత్స్యకారులకు గౌరవం, గుర్తింపు ఇచ్చన వైఎస్సార్ సీపీ వెంటే మత్స్యకారులంతా ఉంటారని చెప్పారు. శనివారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ గతంలో రాజకీయ పార్టీలు మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకునేవని చెప్పారు. నరసాపురం మున్సిపాలిటీ చరిత్రలో మత్స్యకార మహిళైన తనకు చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. కనీస వేతనాల సలహామండలి చైర్మన్‌గా మరో మత్స్యకార మహిళ బర్రి లీలకు అవకాశం ఇచ్చారన్నారు. ఇచ్ఛాపురం నుంచి తడ వరకూ 80లక్షల మత్స్యకార జనాబా ఉందని, గతంలో రాజకీయ పార్టీ తమకు గౌరవం, గుర్తింపు ఇవ్వలేదన్నారు. మత్స్యకార సొసైటీ సంఘం జిల్లా అధ్యక్షుడు అంద్రాజు చాల్లారావు మాట్లాడుతూ వేములదీవికి చెందిన తిరుమాని నాగరాజును మత్స్యకార అభివృద్ధి కమిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం శుభపరిణామమని చెప్పారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నియోజకవర్గంలో అధికసంఖ్యలో ఉన్న మత్స్యకారులకు రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. మొగల్తూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కర్రి ఏసుబాబు మాట్లాడుతూ నరసాపురం ఏఎంసీ చైర్మన్‌గా మత్స్యకారుడు రేవు సాంబమూర్తిని మొదటిగా వైఎస్ ముఖ్యమంత్రిగా ఉండగా ముదునూరి ప్రసాదరాజు నియమించారన్నారు. అప్పటి నుంచి మత్స్యకారులకు పెద్దపీట వేస్తూ వస్తున్నారని అన్నారు. కౌన్సిలర్ బర్రి జయరాజు మాట్లాడుతూ మోపిదేవి వెంకటరమణను రాజ్యసభకు పంపడం ద్వారా మత్స్యకారులకు దేశవ్యాప్తంగా జగన్ గుర్తింపు తెచ్చారని చెప్పారు. నలుగురు మత్స్యకారులకు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడం ఒక రికార్డు అన్నారు. తిరుమాని నాగరాజు మాట్లాడుతూ తనకు మత్స్యకార అభివృద్ధి కమిటి చైర్మన్ పదవి ఇవ్వడంపై ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సమావేశంలో మత్స్యకారనేతలు మల్లాడి బుజ్జి, తిరుమాని కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



మార్టేరులో స్వామివారిని అశ్వరథంపై ఊరేగిస్తున్న అయ్యప్ప మాలధారులు

పెనుమంట్ర: మార్టేరు శ్రీఅయ్యప్పస్వామి సేవా పీఠం ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామివారిని అశ్వరథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయం నుంచి అడబాల శ్రీనివాస్ వెంకటరమాప్రభ దంపతులు ఈ రథోత్సవాన్ని ప్రారంభించగా మేళతాళాలు, గరగ నృత్యాలతో నెగ్గిపూడి, మార్టేరు, వెలగలేరు, వనుంపల్లి గ్రామాల మీదుగా సాయంత్రం తిరిగి అయ్యప్ప దేవాలయం వరకూ సాగింది. గురుస్వామి మల్లిడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పేటతుళ్ల గ్రామోత్సవ కార్యక్రమంలో వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి, తమనంపూడి విజయారెడ్డి, చిర్ల శ్యామ్‌సందరరెడ్డి, మేడపాటి చిన్నారెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, నెగ్గిపూడి సర్పంచ్ అల్లం సాయిరెడ్డి, 150 మందికి పైగా మాలధారులు పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారులు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ సీహెచ్‌వీవీ సత్యనారాయణ

యలమంచిలి: రైతులు, వ్యవసాయాధికారులు సమన్వయంగా పని చేసి దాళ్వా పంటను గట్టెక్కిద్దామని ఇరిగేషన్ డీఈ సీహెచ్ వివి సత్యనారాయణ కోరారు. చించినాడ పంట కాల్వ పరిధిలోని గుమ్ములూరు, రావిపాడు, పెనుమర్రు, మేడపాడు, నేరేడుమిల్లి, యలమంచిలి, శిరగాలపల్లి, కట్టుపాలెం గ్రామాల రైతులతో దాళ్వా సాగుకు పంట నీరు విషయంగా శనివారం మేడపాడు రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సాధారణం కన్నా 56 శాతం వర్షాలు తక్కువగా కురిశాయన్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమ డెల్టాలో సాగు, తాగు నీటికి 10 టీఎంసీల నీరు తక్కువగా అందుతుందన్నారు. కాబట్టి రైతులు డిసెంబర్ 15 నాటికి నారుమడులు పోయాలని ఆయన కోరారు. ఆఖరి రెండు తడులకు నీటి ఎద్దడి ఏర్పడితే మురుగు డ్రయిన్స్‌పై అడ్డుకట్టలు వేద్దామని ఆయన చెప్పారు.

**పీఆర్–126 విత్తనంపై రైతులు పట్టు**

పీఆర్–126 విత్తనం వేయవద్దని వ్యవసాయ అధికారులు చెప్పడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విత్తనం అధిక దిగుబడులు ఇవ్వడంతో పాటు, రెండు వారాలు ముందుగా కోతకు వస్తుందని రైతులు చెప్పారు. ఈ విత్తనం సాగు చేయడానికి రైతులంతా సిద్ధపడుతున్న సమయంలో అధికారులు ఈ విత్తనం సాగుచేస్తే ధాన్యం కొనమని చెప్పడం భావ్యం కాదని పట్టుబట్టారు. దీనిపై మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి స్పందిస్తూ పీఆర్–126 సాగు చేయవద్దని జిల్లా అధికారుల ఆదేశాలన్నారు. రైతులంతా ఊకుమ్మడిగా పట్టుబడుతున్న నేపథ్యంలో రైతుల నిర్ణయాన్ని అధికారులకు తెలియజేస్తానన్నారు. అంతవరకు ఈ విత్తనం సాగు చేయవద్దన్నారు. కాదని సాగు చేస్తే ప్రైవేట్ మార్కెట్‌లో అమ్ముకోవాల్సి వస్తుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ ఎస్ శ్రీనివాస్, మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ రైతులు గుర్రాల వెంకట్రావు, తోటకూర చంటిరాజు, పెన్మెత్స రామభద్రరాజు, వెంకట్రాజు, జెట్టి వీరభద్రరావు, చిలుకూరి సతీష్, తమ్మినీడి వేణు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సేవకుడిని ఆశీర్వదించాలి



యలమంచిలి: మేడపాడులో లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న నాయకులు

యలమంచిలి: రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ఊపిరిగా పనిచేస్తున్న ప్రజా సేవకుడు జగనన్నను ప్రజలంతా మరొకసారి ఆశీర్వదించాలని కోరుతూ శనివారం మేడపాడు గ్రామంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు, 2019 ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీలను వివరించి ఎవరెన్ని హామీలను నెరవేర్చారో ప్రజల చేత సమాధానం చెప్పించారు. మాటిస్తే మడమ తిప్పని విధంగా ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేసిన జగనన్నకు ప్రజలంతా బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ కుసుమే సోని నాయకులు డేగల వెంకటేశ్వరరావు, కుక్కల సూరయ్య, కుక్కల ఆంజనేయులు, ఉండ్రాజవరపు ఆంజనేయులు, కుక్కల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**పెనుమంచిలిలో..**

పెనుగొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతీ ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కించుకొన్నారని, మరింత సంక్షేమానికి సీఎం జగన్ ఆవశ్యకత ఎంతైనా ఉందని పెనుమంచిలి సర్పంచ్ గణేశుల శేషవేణి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా శనివారం గ్రామంలో సచివాలయం పరిధిలో ఇంటింటికీ తిరిగి బ్రోచర్లు అందించారు. సచివాయం పరిధిలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, ఉప సర్పంచ్ గంటి బాబూరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనరు నక్కా ప్రేమ్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ పుచ్చకాయల భీమారావులు పాల్గొన్నారు.